క్లుప్తంగా

ఈసెట్‌లో విద్యార్థులకు ర్యాంకులు


సాయి


సుదేష్ణ

కోరుట్లటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులకు ఈసెట్‌లో ఉత్తమ ర్యాంకు వచ్చినట్లు ప్రిన్సిపాల్ రామాప్రసాద్ బుధవారం తెలిపారు. కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంకు చెందిన సాయికి 16వ ర్యాంకు, సుదేష్ణకు 105 ర్యాంకు లభించిందని ఆయన తెలిపారు. వీరికి రాష్ట్రంలోని టాప్ 20 కళాశాలలో మెకానికల్, కంప్యూటర్,ఎలక్ట్రానిక్స్‌లలో బీ.టెక్ ఫ్రీ సీటు లభించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

పాఠశాలకు గేటు వితరణ


గేటు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99 పదో తరగతి పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.25 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన మెయిన్‌గేట్‌ను బుధవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, రొట్టె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి


నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

కథలాపూర్: సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంపీవో ప్రవీణ్, ఏఈ చంద్రశేఖర్, ఏపీవో రాజేందర్, ఈసీ లక్ష్మయ్య, తౌఖీర్ అహ్మద్ పాల్గొన్నారు.

గీతాపారాయణం కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శివ శ్రీనివాస్

మల్లాపూర్: గీతాపారాయణంలో ప్రజలందరూ స్వచ్ఛందగా పాలుపంచుకోవాలని లయన్స్‌క్లబ్ రిజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద గీత జ్ఞాన యజ్ఞం కరపత్రాలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. మల్లాపూర్‌లోని వాసవీకన్యక పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 5 వరకు గీత సత్సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉత్తమ గీత ప్రబోదక్ శ్రీ చిలమంతుల ఛత్రపతి నేతృత్వంలో 77వ గీత జ్ఞాన యజ్ఞం(భక్తి యోగం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జ్ఞాన యజ్ఞంలో పాల్గొనే సభ్యులందరికీ భగవద్గీత పుస్తకాలు ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో రుద్ర లక్ష్మీరాజం, శివ రాంకిషన్, ముద్దం సత్యనారాయణగౌడ్, రుద్ర రాంప్రసాద్, క్యాతం సురేష్‌రెడ్డి, ఎలాల సత్యనారాయణరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి ఆలయ వార్షికోత్సవం


నరసింహ హోమంలో పాల్గొన్న భక్తులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీధనలక్ష్మీ సూర్యభగవాన్‌సహిత ధన్వంతరి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చిలుకముక్కు రాజు, విష్ణు శర్మతో పాటు అర్చకుల బృందం అభిషేకం జరిపించారు. నరసింహ జయంతిని పురస్కరించుకుని హోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ప్రసాదంగా అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో పాల్తెపు శంకర్, డా రాజన్న, డా ధనుంజయ, తవుటు రాంచంద్రం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంపిణీకి పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

- రైతులకు సబ్సిడీపై అందజేత
- భూసారం పెంపు, అధిక దిగుబడి
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు


పెగడపల్లిలో నిల్వ ఉన్న జీలుగ విత్తనాలు

పెగడపల్లి: మరికొద్ది రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దుక్కులు దున్ని భూములను సిద్ధం చేస్తున్నారు. సహకార కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పచ్చిరొట్ట విత్తనాల ధరలను ఖరారు రాష్ట్ర వ్యవసాయశాఖ ఖరారు చేసింది. కొద్ది రోజులుగా రైతులు వీటి కోసం ఎదురు చూస్తున్నారు. జీలుగ, జనుము వంటివి సాగు చేసుకుని పచ్చిరొట్టగా మార్చుకొని పొలాన్ని సారవంతం చేసుకుని అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో సుమారు ఐదు లక్షల ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగవుతున్నాయి. రసాయనిక ఎరువులతో తాత్కాలిక లాభం ఉంటుందని గ్రహించిన రైతులు సేంద్రియ ఎరువులుగా పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా ఇందులో సుమారు 3.5 లక్షల ఎకరాల్లో వరకు వరి ఉండొచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. దీని కోసం పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుము ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నారు. పచ్చిరొట్ట అయిన జీలుగ, జనుము విత్తనాలు దుక్కిలో వేసి దున్నితే భూసారం పెరుగుతుంది. ఇందుకు అవసరమగు విత్తనాలు ఏటా వానకాలం సాగుకు ముందు అందజేస్తున్నారు. రోజురోజుకు రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిపోతోంది. దీనివల్ల భూసారం తగ్గడమే కాకుండా దిగుబడి కూడా ఆశించిన మేర రావడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని చాలామంది రైతులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నా పూర్తి దశలో రైతులు ముందుకు రావడం లేదు. అయితే కనీసం దుక్కిలోనైనా పచ్చిరొట్ట ఎరువులు వేస్తే కొంతవరకైన భూసారం పెరిగే అవకాశముంది.

65 శాతం రాయితీ

విత్తనాల ధరాలు ఇలా: 30 కేజీల జీలుగ సంచికి రూ. 2790 రూపాయలు ఉండగా సబ్సిడీ రూ. 1,674 పోగా 1,116 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. 40 కేజీల జనుము సంచికి రూ. 3,620 ఉండగా సబ్సిడీ రూ. 2,172 పోనూ రూ. 1448 చెల్లించాల్సి ఉంటుంది. 20 కేజీల పిల్లి పెసర సంచికి రూ. 2710 ఉండగా సబ్సిడి రూ. 1626 పోనూ రూ. 1084 చెల్లించాలి. ఈ విత్తనాలు జిల్లాలోని అన్ని సహకార కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుల జిరాక్స్‌తో మండల వ్యవసాయాధికారులను సంప్రదించి విత్తనాలు తీసుకోవచ్చని అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం 60 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందిస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భూసారం పెంచుకోవడం కోసం రైతులు భూమిలో జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలు చల్లుకుంటే పంటల దిగుబడి పెరుగుతుంది. విత్తనాలు మండలాల్లోని సహకార సంఘాల్లో అందుబాటులో ఉన్నాయి. రైతుల అవసరం మేరకు విత్తనాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పచ్చిరొట్ట విత్తనాల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– వాణి, జిల్లా వ్యవసాయ అధికారి

గుంతలతో వాహనదారుల ఇక్కట్లు


రహదారిపై ఉన్న గుంతలు



కొండగట్టు: ప్రముఖ పుణ్య క్షేత్రం కొండగట్టు గుట్ట కింద చౌరస్తా వద్ద రహదారిపై ఓవైపు లోతైన గుంత,మరో వైపు అధిక మొరం ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు, దగ్గరికి వచ్చే వరకు ఆ గుంత కనపడక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు కిందపడుతున్నాయి. త్వరలోనే హనుమాన్ జయంతి నేపథ్యంలో అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వెల్గటూర్: ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం మండల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా వెల్గటూర్‌తో పాటు పరిసర మండలాల పరిధిలో తరచుగా దొంగతనాలు జరుగుతున్నాయని, వేసవికాలంలో రాత్రిపూట ఇంటికి తాళం వేయకుండా ఆరు బయట నిద్రిస్తున్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేసి నగదు, బంగారం దోచుకుపోతున్నారని తెలిపారు. కాబట్టి మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని సూచించారు. గ్రామస్తులు రాత్రి వేళల్లో బృందాలుగా ఏర్పడి గ్రామానికి రక్షక బృందాలుగా పనిచేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


పొరండ్లలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంపత్‌రావు

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్‌రావు అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల, అర్బన్ మండలం గోపాల్‌రావుపేటలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలో 65 కేంద్రాల్లో కొనుగోళ్లను ముగించామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 10.56 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 10,800 మంది రైతులకు రూ.134.80 కోట్లు ఖాతాలో జమ చేశామని పేర్కొన్నారు. కేంద్రాల్లో కొనుగోళ్ల వేగవంతం చేశామన్నారు. రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ డీపీఎం జేడీ మల్లేశం, ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, సాగర్, వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాల్లో 'అడ్లూరి'


నంచర్ల బీరయ్య పట్నాల్లో ప్రభుత్వ విప్

పెగడపల్లి: మండలంలోని నంచర్ల, మద్దులపల్లి గ్రామాల్లో జరుగుతున్న బీరప్ప దేవుని ఉత్సవాల్లో బుధవారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని కుర్మ, యాదవులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరప్ప ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

పెగడపల్లి: ఆటల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని పెగడపల్లి ఎస్సై రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మండల ఫోటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుండంతో పాటు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితం పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సురేశ్, రాకేశ్, జనార్దన్‌రెడ్డి, గురుప్రసాద్, లక్ష్మణ్, శ్రీనివాస్, శేఖర్, గంగాచారి, రామ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తే పుట్టగతులుండవు'


మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

కథలాపూర్: ఎన్నికల ముందు ఓట్లు దండుకోవడానికి రైతులకు రైతు భరోసా, ధాన్యానికి బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి... గద్దెనెక్కాక మోసం చేసిన కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి అన్నారు. బుధవారం కథలాపూర్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వరికి రూ. 500 బోనస్ ఇస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఇప్పుడేమో సన్నరకం వరికి బోనస్ ఇస్తామనడం దారుణమన్నారు. రాష్ట్రంలోని మంత్రుల మధ్య అవగాహన లేకపోవడంతో ఎవరికి వారే ప్రకటనలు చేసి ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత వల్ల కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కుప్పలు పోసి రెండు నెలలు అయినప్పటికీ పూర్తిస్థాయిలో కొనుగోలు జరగలేదన్నారు. పలు గ్రామాల రోడ్లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయంలో నిధులు మంజూరైతే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఆపేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఎం.డీ రఫీ, బీఆర్‌ఎస్ నాయకులు గుండారపు గంగాధర్, కల్లెడ శంకర్, సబ్బని గంగు, ఏజీబీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ధర్మపురి: మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సంజిదా భాను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ హెచ్‌ఈసీ, సీఈసీ కోర్సుల్లో చేరే విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కళాశాలలో విశాలమైన భవన సముదాయం, ఆకర్శనీయమైన తరగతి గదులు, నాణ్యమైన భోజన వసతి, అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తప్పిన ముప్పు..


రైస్ మిల్లు వద్ద వ్యాపిస్తున్న మంటలు

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం పొలాస గ్రామ శివారులో రైతులు పొలాల వద్ద గడ్డికి నిప్పు పెట్టగా, ఈదురుగాలులతో రైస్‌మిల్లుల వరకు వ్యాపించడంతో తీవ్ర ఆందోళన చెందారు. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది బుధవారం రాత్రి అక్కడకు చేరుకుని రైస్‌మిల్లులకు మంటలు వ్యాపించకుండా నివారించారు. దీంతో రైతులంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన కాశవత్తుల పద్మ అనే మహిళకు కాలు ఆపరేషన్ నిమిత్తం రూ. 85 వేలు ఎల్‌వోసీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ నాయకుడు వంశీ బుధవారం తెలిపారు. అత్యవసరంగా ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పడంతో నిమ్స్‌లో వైద్యం అందించేందుకు గాను రూ. 85 వేలు ఎల్‌వోసీ మంజూరు చేయించారన్నారు.

క్రీడాకారుడికి అభినందన


హరికృష్ణను అభినందిస్తున్న గ్రామస్తులు

బుగ్గారం: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు పంచిత హరికృష్ణను గ్రామ యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. హరికృష్ణ ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొని పసిడి పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు,యువకులు బాలుడిని ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ఇలాంటి వారికి ప్రోత్సహించి మట్టిలో మాణిక్యాలను దేశం గర్వించేలా తీర్చిదిద్దాలని కోరారు.

పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలి


పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: అమ్మ ఆదర్శ పాఠశాలలో వెంటనే మరమ్మతుల పనులు ప్రారంభించాలని తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి ప్రసాద్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎర్దండిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. వచ్చే నెల 12న పాఠశాలల ప్రారంభంలోగా మూత్రశాలలు, తాగునీటి వసతి, విద్యుత్ తదితర మరమ్మతు పనులను పూర్తి చేయాలని కోరారు. అనంతరం మూలరాంపూర్, వేములకుర్తి, గోదూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

పెగడపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మంజూరైన పనులు పాఠశాలలు ప్రారంభం అయ్యేలోపు పూర్తి చేయించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, పర్యవేక్షణ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 23 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ. 1.20 కోట్లు మంజూరయ్యాయని విద్యుత్ పనులు, తాగునీటి వసతి, మూత్రశాలల మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, ఎంఈవో శ్రీనివాస్, ఏపీవో అనిల్, ఏపీఎం సమత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రం టౌన్–1 పరిధిలోని యావర్‌రోడ్, కృష్ణానగర్, ఎండీ శంకర్ హాస్పిటల్ ఏరియా, అరవింద్‌నగర్, అంగడిబజార్, టాకాసంది, మార్కండేయ టెంపుల్ ఏరియా, మార్కెట్ బ్యాక్‌సైడ్ ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అశోక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

బుగ్గారం: మండలంలోని గంగాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సిరవేణి సురేశ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు వేముల సుభాష్ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. సురేశ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా, అంత్యక్రియలలో పాల్గొని ఆర్థికసాయం చేశారు. ఆయన వెంట రెంటం శ్రీధర్,అడ్డగట్ల సుభాశ్, సిరవేణి పెద్దనర్సయ్య, దీపక్,గుర్రం తిరుపతి,బొల్లి పరశురాం, సీర్నేని సాయి, సంతోష్, ముద్దసాని అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాయికల్: మండలంలోని వీరాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1984–86 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి బుధవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు నందెల్లి మదన్‌మోహన్‌రావును ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చేసిన అల్లర్లను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుంపల స్వామిరెడ్డి, సోమ నర్సారెడ్డి, శోభారాణి, నీలి మహేందర్, నారాయణ, స్వామి, రాజం, రవీందర్, శంకర్, మహిపాల్, షేక్ ఇబ్రహీం, ఎర్రోల్ల నర్సయ్య పాల్గొన్నారు.

బీసీ సంఘాల 'ఇటిక్యాల' అధ్యక్షుడిగా రొట్టె శ్రీధర్


నూతన కార్యవర్గ సభ్యులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల బీసీ ఐక్యత సంఘాల అధ్యక్షుడిగా రొట్టె శ్రీధర్, ఉపాధ్యక్షులుగా బూసనవేని శ్రీనివాస్, సింగని నవీన్, కోశాధికారిగా బయ్యని అంజి, కార్యదర్శిగా కనపర్తి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా కొక్కెర చంద్రశేఖర్ బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘాల ఐక్యతకు కృషి చేస్తామని తెలిపారు.

28న మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో ఈ నెల 28న ఉదయం 11గంటలకు ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ హాజరవుతున్నారని, జెడ్పీటీసీ, మండల కో–ఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వైభవంగా వసంతోత్సవం



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధి వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. నిత్యహోమం, చందనోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వేణుగోపాలచార్య పాల్గొన్నారు.